నాడు కళావిహీనం..
నేడు సుందరవనం

- ఆహ్లాదం.. ఆరోగ్యానికి కేరాఫ్ సత్యానగర్ పార్కు
- ఆధునిక హంగులతో పార్కు అభివృద్ధి
- జీవీఎంసీ ద్వారా రూ.2 కోట్లతో సకల సౌకర్యాలు
- మరో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు





నాడు: పిచ్చితుప్పలతో ఉన్న సత్యానగర్ పార్కు



నేడు: రూ.2 కోట్ల నిధులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీర్చిదిద్దిన సత్యానగర్ పార్కు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డులోని సత్యానగర్ పార్కు గతంలో పిచ్చి తుప్పలు..డొంకలతో నిండిన ఓ ఖాళీ స్థలం. పేరుకు పార్కు స్థలమే అయినా పూర్తిగా కళావిహీనం. నేడు ఆ పార్కు ఓ సుందరవనం. ఆరోగ్యానికి కేరాఫ్ అడ్రస్..టీడీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన ఈ పార్కును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధి చేసింది. కేవలం ఓ కాలనీ పార్కు అని చిన్నచూపు చూడకుండా ఏకంగా రూ.2 కోట్లు నిధులు విడుదల చేసి ఆధునిక హంగులతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. దీంతో పాటు మరో రూ.5 లక్షల నిధులతో పార్కులో జిమ్ పరికరాలు ఏర్పాటు చేసి కాలనీ వాసులకు అందుబాటులో ఉంచింది.

శరవేగంగా..

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ఆ దిశగా జీవీఎంసీ విలీన కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేసింది. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రజల ఆసక్తిని, అవసరాన్ని గుర్తించిన జీవీఎంసీ అధికారులు కాలనీల్లో పార్కులను జిమ్‌లుగా కూడా మారుస్తున్నారు. ఈ క్రమంలో సత్యానగర్ పార్కును ఎంపిక చేసి అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. కాలనీ వాసులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

నాడు

గత ప్రభుత్వంలో కాలనీల్లో పార్కులు పిచ్చి తుప్పలు..డొంకలతో నిండి ఉండేవి. సాధారణ ప్రజానీకం వాటిని వినియోగించక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉండేవి. కొన్నిచోట్ల కాలనీవాసులు ముందుకు వచ్చి పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసుకున్న పార్కుల్లోనే పిల్లలకు ఆటవిడుపు..పెద్దలకు సాయంత్రం పూట కాస్త కాలక్షేపం ఉండేది.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్కులను అభివృద్ధి చేసింది. ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. పిచ్చి మొక్కలు తొలగించి ఆహ్లాదం పంచేలా పచ్చదనం పెంపొందించింది. రూ.కోట్ల నిధులు జీవీఎంసీ ద్వారా విడుదల చేసి పార్కులను నందన వనాల్లా మార్పు చేసింది. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది.



పార్కులో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

వ్యాయామంపై దృష్టి



మా ప్రాంతంలో పార్కును ప్రభుత్వం రూ.2 కోట్లతో సుందరంగా అభివృద్ధి చేసింది. మరి కొన్ని నిధులు అదనంగా విడుదల చేసి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులంతా వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. కాసేపు పార్కులో సేద తీరిన తర్వాత జిమ్ చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటులో ప్రభుత్వం చొరవ అభినందనీయం.

– ఎస్.వేణుగోపాల్, సత్యానగర్ కార్యదర్శి.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చాలా కీలకమైన నిర్ణయాలు తీసుకుంటుంది. గతంలో పార్కుల్లో కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కాదు. ఒకవేళ ఎక్కడైనా అభివృద్ధి చేసినా వాకింగ్ ట్రాక్ వరకు మాత్రమే పరిమితం. కానీ ప్రస్తుత ప్రభుత్వం పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తోంది. సత్యానగర్ పార్కుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంపై సర్వాత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– మెంటి మహేష్, చినముషిడివాడ

మృతుల కుటుంబాలకు సాయం అందజేత



మృతుడి కుటుంబానికి నగదు డిపాజిట్ బాండు అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు పోలిపల్లి కూడలికి చెందిన భరిణికాన ఈశ్వరరావు అనారోగ్యంతో ఈ నెల 4న మృతి చెందారు. ఇతను సింహాద్రి ఎన్టీపీసీలో డీఎం ప్లాంట్‌లో 20 ఏళ్లుగా స్కిల్డ్ వర్కరుగా పని చేస్తున్నాడు. ఈశ్వరరావు మరణ వార్త తెలుసుకున్న తోటి కార్మికులు అతని కుటుంబాన్ని ఆదుకోవాలని ముందుకు వచ్చారు. డీఎం ప్లాంటు ఉద్యోగులు, కార్మికులు సమకూర్చిన రూ.3,05234 లను ఫిక్సిడ్ డిపాజిట్ రూపంలో జమచేసి బాండును మృతుడి భార్యకు బుధవారం అందజేశారు.

- అయ్యప్ప దీక్షలో ఉంటూ ఇటీవల మరణించిన ఈశ్వరరావు కుటుంబానికి నాయుడుపాలేనికి చెందిన గురుస్వామి కూండ్రపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వాముల పీఠం తరపున సమకూర్చిన రూ.15 వేల నగదును మృతుడి భార్యకు అందజేశారు.

క్లుప్తంగా

పాలిటెక్నిక్ విద్యార్థులకు సకల సదుపాయాలు



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్

పెందుర్తి: ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పాలిటెక్నిక్ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో నిలవాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. కళాశాలలోని స్కిల్ హబ్ పనితీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఆటోమెషన్ సెంటర్‌ను పరిశీలించారు. పీఎం కెవీవై 4.0ను సందర్శించారు. పలు అంశాలపై విద్యార్థులతో ముచ్చటించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, హెచ్‌వోడీలు సత్తిబాబు, నాగమణి, శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు పరవాడలో సీఎం జన్మదిన వేడుకలు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని రామారావు కోరారు.

ఉత్సాహభరితంగా 'కౌశల్' పోటీలు



విద్యార్థులను ఎంపిక చేస్తున్న నిర్వాహకులు

పెందుర్తి:విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ కాస్ట్ సంయుక్తంగా నిర్వహించిన 'కౌశల్' పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహించారు.క్విజ్ పోటీల్లో కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు మొదటి స్థానం. పెదనరవ బీసీ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు రెండో స్థానం, పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో మొదటి స్థానంలో కె.హరికోమల(చిట్టివలస జెడ్పీ స్కూల్), రెండో స్థానంలో ఎస్.ఎస్.లింకేష్ (బీసీ వెల్ఫేర్ స్కూల్ పెదనరవ), మూడో స్థానంలో సీహెచ్.ధనలక్ష్మి(చిట్టివలస జెడ్పీ స్కూల్) ఎంపికయ్యారు. కార్యక్రమంలో భారతీయ విజ్ఞాన మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్ అవధాని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ చిన్నమ్ములు, సహ కో ఆర్డినేటర్ ఎస్.రామారావు, ఏపీ కాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ పి.రాజారావు తదితరులు పాల్గొన్నారు

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బంతికోళ్ల పద్మ తదితరులు

సబ్బవరం:మండలంలోని సబ్బవరం దుర్గానగర్ కాలనీలో రూ.3 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్ల పనులకు బుధవారం వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెద్దం ప్రసాదరావు, అడ్వకేట్ బేతిన శ్రీనివాసరావు, నాయకులు,కాలనీ పెద్దలు గొర్లి కనకం ,గొర్లి గోవింద్, రొంగలి కనకారావు, గొర్లి రమణ బాబు,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



గణేష్‌కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే అన్నరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపనలు చేశారు. గణేష్‌కాలనీలో రూ.37.93 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లతో పాటు వెంకటాద్రినగర్‌లో రూ.39.78లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లకు, దుర్గానగర్‌లో రూ.93 వేలతో సీసీ డ్రైన్, చందనపురికాలనీలో రూ.7లక్షలతో నిర్మించినున్న సీసీ డ్రైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, వైఎస్సార్‌సీపీ 93వవార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ, నాయకులు దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, గణేష్‌కాలనీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆర్.రామారావు, ఎస్ఎస్ఎన్.రాజు, కాలనీ నిర్వాసితులు కె.రామ్‌గోపాల్, డి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వినియోగదారులకు అవగాహన సదస్సు

పరవాడ: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కన్జ్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ పై సదస్సు నిర్వహించడం జరుగుతుందని సొసైటీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలు చేసే వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తూనికల్లో తేడాలు, కొలతల్లో మోసాల పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సింహగిరిపై ఘనంగా ధనుర్మాస పూజలు



గోదాదేవికి హారతి అందజేస్తున్న అర్చకుడు



పూజలు చేస్తున్న అర్చకుడు



పూజల్లో పాల్గొన్న మహిళలు

సింహాచలం: సింహగిరిపై ధనుర్మాస పూజలను నాలుగో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం జరిగిన అయ్యవారి సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకీలో అదిష్ఠింపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో అదిష్ఠింపజేసి దివ్యప్రబందపారాయణాలు పఠించారు.
- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారిని విశేషంగా అంలకరించి వేదికపై అదిష్టింపచేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈపూజలు నిర్వహించారు.

వెంకన్న సన్నిధిలో..

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు. అనంతరం శ్రీవారి హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలల్లో స్వామివారి హుండీ ఆదాయం రూ. 7,00,709 వచ్చినట్లు ఈవో నీలిమ తెలిపారు.



అప్పన్న ఉత్సవమూర్తులకు బేడా తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

24న శెట్టిబలిజల వన సమారాధన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: ఈ నెల 24న విశాఖ స్టీల్ ప్లాంట్ ఉక్కునగరం నెహ్రూ పార్కులో జరగనున్న యాత, శెట్టిబలిజ, గౌడ, శ్రీశైన, ఈడిగ కులస్తుల వన సమారాధనను విజయవంతం చేయాలని సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సీతంపేటలోని ఆయన కార్యాలయంలో బుధవారం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత, శెట్టిబలిజ, గౌడ, శ్రీశైన, ఈడిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న పిక్నిక్‌కు సంఘస్తులందరూ కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ పాల్గొని సంఘ పురోభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చి పారిశ్రామిక ప్రాంతంలో మన కులస్తుల ఐక్యత, చైతన్యం నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. వివరాలకు 97018 37172, 93999 90345 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు నెల్లి సాధూరావు, చెల్లిబోయిన నాయుడు, పోలవరపు రమణబాబు, యలమంచిలి మంగరాజు, కడలి సుబ్బారావు పాల్గొన్నారు.

లలితా పీఠంలో పాశుర విన్నపం



పాశుర విన్నపం చేస్తున్న అర్చకుడు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం ఐదో రోజు పాశుర విన్నపం జరిగింది. ఈ సందర్భంగా గోదాదేవికి పంచామృతాభిషేకం, వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 23న ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



